



బకాయిలు రూ.9 కోట్లు..

- జీపీలకు రూ.లక్ష నుంచి రూ.6 లక్షల వరకు బిల్లులు పెండింగ్
- ప్రత్యేక అధికారుల హయాంలో చెల్లింపులు నిల్
- తొమ్మిది నెలలుగా నిలిపేసిన ప్రభుత్వం
- అప్పులపాలైన గ్రామ కార్యదర్శులు
- జిల్లాలో మొత్తం 487 గ్రామ పంచాయతీలు

కేసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : 'గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు' అని మహాత్మాగాంధీ అన్నట్లు పల్లెలు అభివృద్ధి సాధిస్తేనే దేశప్రగతి సాధ్యం. అలాంటి గ్రామాల్లోని కీలకమైన పరిపాలన వ్యవస్థ అయిన గ్రామపంచాయతీలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రామపంచాయతీల్లో పాలకవర్గాల కాలపరిమితి ముగియడంలో జీపీల్లో నిర్వహణ భారమంతా కార్యదర్శులపై పడింది. ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడంతో తొమ్మిది నెలలుగా పంచాయతీ కార్యదర్శులు తమ సొంత డబ్బులను వెచ్చించి, గ్రామాల నిర్వహణ చేపడుతున్నారు.

గ్రామాల్లో ప్రధానంగా పారిశుధ్య పనుల్లో వినియోగించే ట్రాక్టర్‌కు డీజిల్, వీధి దీపాలను ఏర్పాటు చేయడం, మంచినీటి సరఫరా కోసం సామగ్రి, పైపులైన్ల మరమ్మతు పనులకు డబ్బులు వెచ్చించాల్సివస్తోంది. ఇవన్నీ అత్యవసరమైన పనులే కావడంతో వాయిదా వేసే పరిస్థితి లేకుండా నిధుల నిల్వ, బిల్లుల విడుదల అంశాలతో సంబంధం లేకుండా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వెంటనే పనులు చేయాల్సివస్తోంది.

జిల్లాలో 487 గ్రామపంచాయతీలు..

మహబూబాబాద్ జిల్లాలో 461 గ్రామపంచాయతీలు ఉండగా, ఇటీవలె మరో 26 కొత్త జీపీలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో మొత్తం 487 గ్రామాలు అయ్యాయి. జిల్లాలో 461 జీపీలకు గ్రామపంచాయతీ కార్యదర్శులు ఉండగా కొత్తగా ఏర్పడిన, పొరుగున ఉన్న జీపీల్లోని కార్యదర్శులే ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. గ్రామపంచాయతీలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చేవి. అలాంటిది అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచే నిధులు నిలిచిపోయాయి. గ్రామాల్లో చేపట్టాల్సిన అత్యవసర పనులకు సర్పంచ్‌లు అప్పులు తెచ్చి నిర్వహించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 2తో సర్పంచుల పదవీకాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన ఆరంభమైంది. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటి వరకు జీపీలకు రాష్ట్ర ఆర్థిక సంఘం (ఎస్ఎఫ్‌సీ) నుంచి ఒకే ఒకసారి వేతనాలు, కరెంటు బిల్లుల కోసం అరకొర నిధులు విడదల చేయగా నిర్వహణ ఖర్చుల కోసం మాత్రం నిధులు విడుదల కాలేదు. ప్రత్యేకాధికారుల హయాంలో ఒక్క రూపాయి విడుదల చేసుకున్న దాఖలాలు లేవు.


కేసముద్రం స్టేషన్‌లో పారిశుధ్య పనులు చేస్తున్న జీపీ సిబ్బంది

నిర్వహణ భారమంతా కార్యదర్శులపైనే..

సర్పంచుల పదవీకాలం ముగిసిన అనంతరం ప్రత్యేకాధికారులను ఏర్పాటు చేసినప్పటికీ వారిని ప్రభుత్వం కేవలం కార్యదర్శులపై పర్యవేక్షణ, నిధుల విడుదలలో జాయింట్ చెక్‌పవర్ కోసం నియమించింది. దీంతో గ్రామాల నిర్వహణ భారం అంతా కార్యదర్శులపై పడింది. గ్రామాల్లో పారిశుధ్య పనుల్లో వినియోగించే ట్రాక్టర్లకు డీజిల్ ఖర్చు కోసం నిత్యం రూ.500 నుంచి రూ.1500 వరకు అవుతోంది. బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయడం, వీధి దీపాలు కాలిపోయిన చోట కొత్త వాటిని అమర్చడం, మంచినీటి సరఫరాల్లో గేట్‌వాల్వ్‌లు, పైపులైన్ల లీకేజీలు తదితర మరమ్మతు పనులు చేయడం కోసం ఒక్కో కార్యదర్శి వేలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. ఇటీవలె నిర్వహించిన బతుకమ్మ పండుగకు రాష్ట్రప్రభుత్వం నుంచి అరకొర నిధులు విడుదల కాగా అంతకు ఐదారురెట్ల ఖర్చు గ్రామాల్లో పెట్టాల్సివచ్చింది. ఈ పనులన్నీ కార్యదర్శులు తమ సొంత డబ్బులను అప్పులు తీసుకువచ్చి పెడుతున్నారు. ఇలా చిన్న గ్రామపంచాయతీల్లో రూ.లక్ష, పెద్ద జీపీల్లో రూ.4 లక్షలు, మేజర్ జీపీల్లో రూ.6లక్షల నుంచి రూ.15లక్షల వరకు పెట్టుబడులు పెట్టి పనులు చేయించారు.

ఇలా జిల్లాలో 487 జీపీల్లో తొమ్మిది నెలలుగా రూ.9 కోట్లకుపైగానే నిర్వహణ బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అంతకుముందు 15 నెలల క్రితం ఆన్‌లైన్ చేసిన బిల్లులు సైతం విడుదల కాకుండా నిలిచిపోయాయి. ఈ క్రమంలో పని ఒత్తిడితో పంచాయతీ కార్యదర్శులు ఇతర ఉద్యోగాలను వెతుక్కొంటూ వివిధ శాఖల్లో ఇటీవలె ఉద్యోగాలు రావడంతో వెంటనే తమ సెక్రటరీ ఉద్యోగానికి రాజీనామా చేసి ఇతర శాఖలోకి మారడం, మరికొందరు ఇతర ఉద్యోగ నియామక పరీక్షలకు సన్నద్ధం అవుతుండడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే జీపీల్లోని బకాయిలను విడుదల చేసి గ్రామ పంచాయతీలను ఆర్థిక సంక్షోభంలోంచి బయటపడేయాలని పలువురు కోరుతున్నారు.

ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కార్యదర్శులు

నాగవెల్లి రంజిత్‌కుమార్, జీపీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, కేసముద్రం మండలం ఉప్పరపల్లి కార్యదర్శి



"గ్రామపంచాయతీ కార్యదర్శులు నిత్యం గ్రామాల్లో వివిధ రకాల పనులతో పని ఒత్తిడితోపాటు బిల్లులు సకాలంలో రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. జీపీల్లో పనులు చేసేందుకు అప్పులు తీసుకువచ్చి ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పెండిం గ్ బిల్లులన్నీ వెంటనే మంజూరు చేసి పంచాయతీ కార్యదర్శులను ఆర్థిక ఇబ్బందుల నుంచి విముక్తి కల్పించాలి."

దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలి

- సాటి మనిషిని ప్రేమించడం మానవత్వం
- ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న జాటోతు రాంచందర్‌నాయక్

మహబూబాబాద్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలని, ప్రతీ ఒక్కరు సాటి మనిషిని ప్రేమించడం మానవత్వమని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో విద్యా, ఉపాధి, వ్యాపార రంగాల్లో దివ్యాంగులు రాణించాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా దివ్యాంగుల కోసం ప్రత్యేక సమయం కేటాయించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. వినికిడి లోపం, అంగవైకల్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న దివ్యాంగుల కోసం ప్రత్యేక సమయం కేటాయిస్తామని చెప్పారు.

మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ప్రభుత్వం కేటాయించిన వీల్‌చైర్‌లు, ట్రైసైకిల్స్, మోటార్ సైకిల్స్, పింఛన్ లాంటివి అర్హులందరికి అందిస్తామన్నారు. వారి కోసం ప్రత్యేకంగా బ్యాంకు సబ్సిడీ రుణాలను, తదితర అంశాలను పరిశీలించి అందించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం క్రీడాల్లో గెలుపొందిన దివ్యాంగులను సన్మానించి బహుమతులు అందజేశారు. అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, డీఆర్‌డీవో పీడీ మధుసూదన్ రాజు, డీపీవో హరిప్రసాద్, డీడబ్ల్యూవో ధనమ్మ, సీడీపీవోలు శిరీష, నీలోఫర్, ఎల్లమ్మ, ఉషారాణి, సులోచన పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించిన డీఎంహెచ్‌వో మురళీధర్


వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

నెహ్రూసెంటర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని డీఎంఅండ్‌హెచ్‌వో గుండాల మురళీధర్ సూచించారు. పర్యావరణ పరిరక్షణ వారోత్సవాల సందర్భంగా కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులతో మంగళవారం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి వద్ద లేదా ఆఫీస్‌లో గదిని విడిచేటప్పుడు విద్యుత్ పరికరాలను ఆఫ్ చేయాలని చెప్పారు. ఎక్కువగా కాలినడకన లేదా సైకిల్ ద్వారా ప్రయాణం చేయాలని చెప్పారు. ప్రజా రవాణా బస్సుల్లోనే ప్రయాణం చేయాలని సూచించారు. నీటిని వృధా చేయకుండా పొదుపుగావాడుకోవాలన్నారు. ఆహారాన్ని వృధా చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, సారంగం, లక్ష్మీనారాయణ, రాజు, రామకృష్ణ, గీత, శారద, మంగమ్మ, సౌమిత్, అరుణ్, నీలిమ, శ్వేత, నీలోహన పాల్గొన్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి

- జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల



మహబూబాబాద్ అగ్రికల్చర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రైతులు విత్తనాల ఎంపిక, కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల కోరారు. మానుకోటలోని జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ విత్తనాల ఎంపిక పంటల దిగుబడిలో కీలకమైందని, సరైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ద్వారా అధిక దిగుబడిని పొందవచ్చునని చెప్పారు. భూమి, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉండే పంట రకాలు మాత్రమే ఎంచుకోవాలని, నీటి వనరులు తక్కువగా ఉండే ప్రాంతాల్లో నీటి ఎద్దడిని తట్టుకునే రకాలను కొనుగోలు చేయాలన్నారు. అధిక వర్షపాతం ప్రాంతాల్లో ఆ పరిస్థితులను తట్టుకునే రకాలను రైతులు కొనుగోలు చేయా లన్నారు. పంట విత్తుకునే ముందు కొనుగోలు చేసిన విత్తనాలను నుంచి కొన్నింటిని తీసుకుని మొలకశాతం పరీక్షించుకోవాలని, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంట రకాలను ఎంచుకుని వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని చెప్పారు. సీడ్ లైసెన్స్ నెంబర్, జీఎస్టీ నెంబర్ ఉన్న దుకాణాదారుడి నుంచే రసీదు పొందాలని కోరారు. రాత్రికి రాత్రికి గ్రామాలకు వచ్చి విక్రయించే నకిలీ విక్రయదారుల నుంచి ఎట్టి పరిస్థితుల్లో విత్తనాలు కొనుగోలు చేయొద్దన్నారు. గడువు దాటిన విత్తనాలను కొనుగోలు చేయొద్దని, ప్యాకింగ్ తేదీ, గడువు తేదీని సరిచూసుకోవాలన్నారు. ప్యాకెట్లు, డబ్బాలపై సీల్ ఉందో.. లేదో చూసుకుని రైతులు మోసపోకుండ ఉండాలని సూచించారు.

సంక్షేమ అధికారిగా ధనమ్మ



మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సంక్షేమ అధికారి (డీడబ్ల్యూవో)గా ధనమ్మ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన వరలక్ష్మి గతనెల 30న పదవీవిరమణ పొందారు. ఆమె స్థానంలో మహబూబాబాద్ సీడీపీవోగా విధులు నిర్వహిస్తున్న శిరీషకు ఇన్‌చార్జి డీడబ్ల్యూవోగా బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత ఖమ్మం జిల్లా మధిరలో సీడీపీవోగా విధులు నిర్వహిస్తున్న ధనమ్మ పదోన్నతిపై మహబూబాబాద్ జిల్లాకు సంక్షేమ అధికారిగా వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ధనమ్మకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

నీరు లేక కళ తప్పిన ఆకేరు



ఆకేరు కళ తప్పింది

పకృతి వైపరీత్యాలు, పాలకులు నిర్లక్ష్యం మూలంగా ఆకేరు కళ తప్పి వెలవెలబోతుంది. ఉగ్గంపల్లి, చిన్నగూడూరు గ్రామాల మధ్య 60ఏళ్ల కిందట ఆనకట్ట, కాలువలు నిర్మించారు. కాలానుగుణంగా మార్పులు చేయకపోవడంతో రెండేళ్ల క్రితం చెక్‌డ్యాం, గత ఏడాది గంగమ్మ ఆలయం ధ్వంసం, ఈ సంవత్సరం ఆగస్టులో ఆనకట్ట కుడి కాలువకు గండి పడడంతో నీరు నిల్వలేక రాళ్లతో దర్శనమిస్తోంది. నిధులు మంజూరైన మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆకేరు కళ తప్పి విలవిలాడుతోంది. యాసంగి సాగుకు వేళవుతున్న సమయంలో ఆకేరులో చుక్క నీరులేక పోవడంతో పరిసర ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు.

- చిన్నగూడూరు, ఆంధ్రజ్యోతి

గుమస్తాల మెరుపు సమ్మె

కేసముద్రం మార్కెట్లో విధులు బహిష్కరించి, నిరసన వ్యక్తం చేస్తున్న గుమస్తాలు



- పెంచిన రేట్లను అమలు చేయాలని డిమాండ్
- రెండు గంటల పాటు స్తంభించిన మార్కెట్
- సకాలంలో ఆందోళన విరమింపజేసిన పోలీసులు, అధికారులు

6



పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

ఇనుగుర్తి మండలానికి త్వరలో రాణా

4

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలి

- నాణ్యమైన భోజనం అందించాలి
- రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడు ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు

మహబూబాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదువుకున్నప్పుడే ఉన్నత స్థానాల్లో ఉంటారని రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడు ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు అన్నారు. ప్రభుత్వం విద్యావ్యవస్థల్లో సంస్కరణలు తీసుకురావడానికి రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడు విశ్వేశ్వర్‌రావు మంగళవారం మహబూబాబాద్ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ హైస్కూల్‌ను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. గూడూరు, మహబూబాబాద్ మండలంలోని జ్యోతిబాపూలే బాలికల గురుకులం, కస్తూర్బాగాంధీ బాలికల గురుకులం, ఎస్సీ బాలికల హాస్టల్‌ను, మైనార్టీ బాలుర గురుకులం, ఆశ్రమ పాఠశాల, సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల్లోని ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. వసతి గృహాల్లో డైనింగ్ హాల్, స్టడీ రూం, వంటగది పరిసరాలను సందర్శించారు. ఆపై వసతులు ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు పాఠశాలల్లో రికార్డులు, రిజిస్టర్లు, బాత్‌రూంలు, డార్మిటరీ రూమ్స్‌లను క్షుణ్ణంగాపరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ పిల్లలకు అందించే ఆహార విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అన్నిరకాల ప్రమాణాలు పాటిస్తూ గడువు తేదీ ముగిసిన సరుకులను ఉపయోగించకూడదని చెప్పారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై వారి అభ్యసన, సామార్థ్యాలను పరిశీలించారు. వారిజీవితంలో ఏమౌతారని ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. ఇప్పట్నుంచే ఒక లక్ష్యాన్ని ఎంచుకుని బాగా చదువుకోవాలని సూచించారు. తొలుత మహబూబాబాద్‌కు వచ్చిన విశ్వేశ్వర్‌రావుకు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ స్వాగతం పలుకుతూ మొక్కను బహూకరించారు. ఆయా కార్యక్రమాల్లో డీఈవో రవీందర్ రెడ్డి, మానుకోట ఆర్డీవో కృష్ణవేణి, బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారి నర్సింహాస్వామి, ఎస్టీ సంక్షేమ అధికారి సైదానాయక్, మైనార్టీ సంక్షేమ అధికారి శ్రీనివాసరావు, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆజాద్, విజయకుమారి, రజినీదేవి, సునీత, రాధిక పాల్గొన్నారు.


మానుకోటలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడు విశ్వేశ్వర్‌రావు, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

తొర్రూరు, (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను విద్యాకమిషన్ సభ్యుడు విశ్వేశ్వర రావు ఆకస్మికంగా తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. పాఠశాల రికార్డులు, రిజిస్టర్‌లు, వంటగది, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు పరిశీలించి ప్రధానోపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట ప్రదేశం ఆరు బయట ఉండటం ఇబ్బందిగా ఉంటుందని, ప్రత్యేక గదుల్లోనే వంట చేయాలన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ పూర్తిస్థాయిలో చేపట్టకపోవడం సరికాదన్నారు. సుమారు 600 మంది విద్యార్థులు అభ్యసిస్తున్న పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పిల్లల ఆహారం విషయం లో ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని, నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వారి సామర్థ్యాలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రవీందర్ రెడ్డి, ఎంఈవో బుచ్చయ్య, మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్, విజయకుమారి, పాఠశాల ఉపాధ్యాయులు, నాగవాణి తదితరులు ఉన్నారు.



బోగీల మధ్య కప్లింగ్ ఊడిపోవడంతో ఆగిన గూడ్స్ రైలు

ఊడిపోయిన గూడ్స్ రైల్ కప్లింగ్

- 10 నిమిషాల్లో మరమ్మతు
- మానుకోటలో ఘటన

నెహ్రూసెంటర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గూడ్స్‌రైల్ డబ్బాల మధ్య ఉన్న లింక్ తెగిపోవ డంతో రెండుగా విడిపోయింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని 436/12బీ క్యాబిన్ వద్ద మంగళవారం ఉదయం 8.30 గంటలకు చోటు చేసుకుంది. రైల్వే అధికారులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ వైపు నుంచి మహబూబాబాద్ మీదుగా రామగుండం వెళ్లుతుండగా, ఓ గూడ్స్ రైలుకు డబ్బాల మధ్యలో ఉండే కప్లింగ్ ఊడిపోయింది. దీంతో రైలు బోగీలుగా రెండుగా వీడిపోయాయి. గమనించిన గార్డు వెంటనే రైలును నిలిపివేసి, ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన రైల్వేసిబ్బంది 10 నిమిషాల్లో పనులను పూర్తి చేశారు. అనంతరం గూడ్స్‌రైలు రామగుండం వైపు వెళ్లిపోయింది. ఆ సమయంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోవడంతో ఆలస్యం జరుగలేదు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

విద్యా శాఖ కమిషన్ సభ్యుడు విశ్వేశ్వరరావు



కేజీబీవీలో వంటలను పరిశీలిస్తున్న విశ్వేశ్వరరావు, అధికారులు

పెద్దవంగర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తూ, విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని విద్యాశాఖ కమిషన్ సభ్యుడు ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం చిన్నవంగరలోని కేజీబీవీ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని, భోజనశాల, వంటశాల, తరగతి గదులతో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చేందుకు ప్రత్యేక ప్రణాళికలను తయారు చేస్తామన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కేజీబీవీ పాఠశాలలో ఉంటున్న విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు, గిరిజన శాఖ అధికారి సైద, కేజీబీవీ కోఆర్డినేటర్ విజయకుమారి, తహసీల్దార్ వి. మహేందర్, ఎంపీడీవో వేణుమాధవ్, ఎస్‌వో స్రవంతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు రహిత జిల్లాగా మార్చాలి

మహబూబాబాద్ డీఎంహెచ్‌వో మురళీధర్

బయ్యారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మానుకోటను కుష్టు రహిత జిల్లాగా నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మురళీధర్ వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఆషాడే కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం బయ్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లెప్రసీ కేస్ డిటెక్షన్‌లో భాగంగా కుష్టు రహిత జిల్లాగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. పక్షోత్సవాల భాగంగా ప్రతి ఆశ కార్యకర్త రోజు 30 ఇండ్లను సందర్శించాలన్నారు. ఇంట్లో ఎవరికైనా మొద్దు బారిన మచ్చలు, రాగి వర్ణం గల స్పర్శలేని మచ్చలుంటే ప్రాథమిక ఆరోగ్యానికి తరలించాలన్నారు. త్వరగా గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా కాపాడే వారు అవుతారని పేర్కొన్నారు. అదే విధంగా జిల్లాలో స్త్రీ పురుష నిష్పత్తి తక్కువగా ఉందని అబార్షన్ అయిన వారి ఇంటిని సందర్శించి వివరాలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాగర్, రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ జ్యోతి, హెల్త్ సూపర్‌వైజర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్యాధికారులకు సూచనలిస్తున్న మురళీధర్

హైకోర్టు తీర్పుపై ఉత్కంఠ

- చల్పాక ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో విచారణ
- ఈ నెల 5న తీర్పు
- పోలీసులకు సవాల్‌గా మారుతున్న పరిణామాలు

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా సంచలం రేపిన చల్పాక ఎన్‌కౌంటర్ హైకోర్టు మెట్లెక్కింది. ఈ నెల 1న చల్పాక అడవుల్లో పొలాకమ్మ వాగు సమీపంలో గ్రేహౌండ్స్ బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందడం రాష్ట్రంలో కలకలం రేపింది. ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందడం మావోయిస్టు పార్టీకి భారీ నష్టాన్ని మిగిల్చింది. పీఎల్‌జీఏ వారోత్సవాల వేళ మావోయిస్టు పార్టీ ఏడుగురిని కోల్పోవడం ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ. ఏజెన్సీ ప్రాంతంపై పూర్తిస్థాయిలో పట్టున్న ఇద్దరు అగ్రనాయకులు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడం మావోయిస్టు పార్టీకి ఆగాథంలోకి నెట్టినట్లయింది.

పోలీసుల కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందగా ఏటూరునాగారం- మహదేవపూర్ డివిజనల్ కార్యదర్శి ఈగోలాపు మల్లయ్య అలియాస్ మధు భార్య మీనా ఎన్‌కౌంటర్‌పై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేయడం, ఎన్‌కౌంటర్ బూటకమని, తన భర్తను పోలీసులు విష ప్రయోగం చేసి చిత్రహింసలు పెట్టారని హైకోర్టులో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పిటిషన్ దాఖలు చేశారు.



ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం

అభ్యంతరాలు లేకుంటే మృతదేహాలను తీసుకెళ్లొచ్చు..

ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మిగతా వారి బంధువులకు ఎలాంటి అభ్యంతరాలు లేకుంటే వారి మృతదేహాలను బంధువులు స్వాధీనం చేయవచ్చని హైకోర్టు తెలిపింది. మిగతా ఆరుగురు మృతదేహాల బంధువుల్లో ఏ ఒక్కరు అభ్యంతరం తెలిపినా తీర్పు వెలువరించే వరకు మృతదేహాన్ని భద్రపర్చాలని కోర్టు తెలిపింది. కానీ ఆరుగురిలో వారి బంధువులు ఎన్‌కౌంటర్‌పై ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని పోలీసుల తరపు లాయర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లగా కోర్టు మృతదేహాలను వారి బంధువులకు అప్పగించొచ్చని తెలిపింది. దీంతో పోలీసులు ఆరుగురి మృతదేహాలను వారి బంధువులకు సమాచారం అందించగా అందులో నలుగురు మృతదేహాలను వారి బంధువులకు అప్పగించారు.

ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో విచారణ

ఏటూరునాగారం- మహదేవపూర్ డివిజనల్ కార్యదర్శి ఈగోలాపు మల్లయ్య అలియాస్ మధు భార్య ఈగోలాపు మీనా ఎన్‌కౌంటర్ బూటకమని, దీనిపై విచారణ చేపట్టాలని ఈనెల 2 వతేదీన హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేయగా హైకోర్టు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. చల్పాక ఎన్‌కౌంటర్ పచ్చి బూటకమని, విష ప్రయోగం ద్వారా మావోయిస్టులను పోలీసులు హతమార్చడం జరిగిందని పిటిషన్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. సిట్టింగ్ జడ్జి సమక్షంలో రీ పోస్టుమార్టం చేపట్టాలని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు ఈ కేసును ఈ నెల 5వ తేదీకి వాయిదా వేసి పూర్తి సమాచారాన్ని కోర్టుకు అందచేయాలని ఆదేశాలు జారీ చేసింది. కోర్టు తీర్పు వెలువరించే వరకు మృతదేహాన్ని మార్చురీలోనే భద్రపరచాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

తీర్పు పోలీసులకు సవాల్

ఎన్‌కౌంటర్‌పై హైకోర్టు తీర్పు పోలీసులకు సవాలుగా మారనుంది. గ్రేహౌండ్స్ పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరగడం ఏడుగురు మావోయిస్టులు మృతి చెందడం పోలీసు శాఖ తరపున అన్ని సవ్యంగా జరిగాయి. కానీ ప్రజాసంఘాలు, ఈగోలాపు మల్లయ్య అలియాస్ మధు భార్య మీనా అనూహ్యంగా ఎన్‌కౌంటర్ బూటకమని హైకోర్టుకు వెళ్లడం పోలీసులకు సవాల్‌గా మారింది.

ఎన్‌కౌంటర్ జరిగి న రోజు నుంచి పోలీసులు నిర్విరామంగా మావోయిస్టు మృతదేహాల తరలింపు, పోస్టుమార్టం, బంధువులకు అప్పగించడం తదితర అంశాల్లో నిమగ్నమయ్యారు. మృతదేహాలను వారి బంధువులకు అప్పగిస్తే పని పూర్తయినట్లని భావించిన పోలీసులకు అనుకోని విధంగా ఈ కేసు కోర్టు మెట్లెక్కింది. హైకోర్టు తీర్పును మరొక రెండు రోజులు వాయిదా వేయడంతో పోలీసులు మల్లాగుల్లాలు పడుతున్నారు. కోర్టు ఏవిధంగా వస్తుందో ఇంకెన్నీ ఈ ప్రక్రియ కొనసాగుతోందని పోలీసులు భావిస్తున్నారు. చల్పాక ఎన్‌కౌంటర్‌పై ప్రజాసంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఎన్‌కౌంటర్ బూటకమని వాదనలు వినిపిస్తున్న ప్రజా సంఘాలు, పక్కా ఎన్‌కౌంటరేనని పోలీసుల వాదనలో కోర్టు తీర్పు ఏ విధంగా ఉంటుందోనని పలువురు ఆసక్తిగా చూస్తున్నారు.

ఇనుగుర్తి మండలానికి త్వరలో ఠాణా

పోలీస్‌స్టేషన్ ఏర్పాటునకు ప్రతిపాదనలు



పీఎస్ కోసం పరిశీలించిన హాస్టల్ భవనం

ఇనుగుర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఏర్పాటైన ఇనుగుర్తి మండలానికి త్వరలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కాబోతోంది. కేసముద్రం మండలంలోని ఇనుగుర్తి, కోమటిపల్లి, నెల్లికుదురు మండలంలోని నాగారం, చెట్లముప్పారం రెవెన్యూ గ్రామాలు, 14 గ్రామపంచాయతీలతో కొత్త మండలంగా 2022లో ప్రభుత్వ ఉత్తర్వులను విడుదల చేసింది. ఈ మేరకు అదే ఏడాది డిసెంబర్, 4న నూతన మండల తహసీల్దార్ కార్యాలయాన్ని అప్పటి మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీలు అట్టహాసంగా ప్రారంభించారు. ఇనుగుర్తి మండలానికి రెవెన్యూ శాఖ నుంచి తహసీల్దార్ నియామకం ఆ తర్వాత మిగతా శాఖల ఏర్పాటుకు చాలా నెలల సమయం పట్టింది. కొద్ది నెలల క్రితం వ్యవసాయ, విద్యాశాఖలను ఏర్పాటు చేసి ఆయా శాఖలకు మండల అధికారులను సైతం ప్రభుత్వం నియమించింది. గతనెల 26న ఇనుగుర్తికి మండల ప్రజాపరిషత్‌ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసిన విషయం విధితమే. నూతన మండలానికి అవసరమైన కీలకమైన శాఖల్లో పోలీస్ శాఖ ఏర్పాటు మాత్రమే మిగిలింది. ఈ నేపధ్యంలో కొన్ని రోజుల క్రితం నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పాటునకు జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి రాష్ట్ర డీజీపీ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ఈ మేరకు డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదల కాగానే ఇనుగుర్తిలో ఠాణా ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. మండలం ఆవిర్భావం సమయంలో స్థానిక బాలుర హాస్టల్ భవనాన్ని తాత్కాలికంగా పీఎస్ ఏర్పాటు కోసం అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఏదేమైనా త్వరలోనే ఇనుగుర్తిలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటుతో పూర్తిస్థాయిలో మండలం రూపు సంతరించుకోనుంది.

సీఆర్‌టీ నోటిఫికేషన్ రద్దు చేయాలి

తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రావణ్ కుమార్

ఏటూరునాగారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఆర్‌టీ నోటిఫికేషన్ రద్దు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక శ్రావణ్ కుమార్ అన్నారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఐటీడీఏ గిరిజన భవన్‌లో తుడుందెబ్బ అత్యవసర మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. ఐటీడీఏ పరిధిలో చాలా ఏళ్లుగా సీఆర్‌టీలుగా ఆదివాసీలు పని చేస్తున్నారని, సీఆర్‌టీ ఉద్యోగులను వేకెన్సీ లేదని, సబ్జెక్టు టీచర్లకు ఖాళీ లేదని సాకుతో 15 ఏళ్లుగా పని చేస్తున్న వారిని విధుల నుంచి తొలగించారని ఆయన ఆరోపించారు. ఈ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేసి గతంలో పని చేసి రెన్యువల్ కానీ మాజీ సీఆర్‌టీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంత చట్టాలకు విరుద్ధంగా నోటిఫికేషన్ జారీ చేసిన ఐటీడీఏ డీడీపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకే అవకాశం లేకుండా నోటిఫికేషన్ జారీ చేయడం చట్ట విరుద్ధమని ఈ నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో ఈ నెల 9న వేల మంది ఆదివాసీ నిరుద్యోగులతో కలిసి ఐటీడీఏను ముట్టడిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు వట్టం జనార్దన్, ఏటూరునాగారం మండల అధ్యక్షుడు సోలం సురేష్, మంగపేట మండల ఉపాధ్యక్షుడు సోలం ఆగబోయిన సాయి కుమార్, సీనియర్ నాయకులు కోరం నాగేశ్వరరావు, వజ్జ రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రావణ్ కుమార్

కొనుగోలు కేంద్రాలకు పోటెత్తుతున్న ధాన్యం

- కొత్తగూడ మండలంలో 23 సెంటర్ల ఏర్పాటు
- వడ్లను భారీగా తీసుకొస్తున్నరైతులు



పాగుళ్లపల్లిలో కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకొచ్చిన ధాన్యం

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పోటెత్తుతోంది. వరికోతలు ఊపందుకోవడంతో ఆయా సెంటర్లకు రైతులు వడ్లను భారీగా తీసుకువస్తున్నారు. సన్నాలకు రూ.2320 మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తోండటంతో ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధానం విక్రయిస్తున్నారు. కలెక్టర్ స్థాయి అధికారి నుంచి క్షేత్ర స్థాయి అధికారులు రైతులకు అవగాహన కలిగిస్తున్నారు. దీంతో రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో..

కొత్తగూడ మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో పొగుళ్లపల్లి, గుండం, సాధిరెడ్డిపల్లి, రేణ్యాతండా, ముస్మీ, దుర్గారం, ఎదుళ్లపల్లి, కొత్తపల్లి, వేలుబెల్లి, మైలారం, బత్తులపల్లిలో ఏర్పాటుచేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో రాంపూర్, కోనాపురం, రౌతుగూడెం, కార్లాయి, చెరువుముందుతండా, గోవిందాపురం, ఎంచగూడెం, తిమ్మాపురం, జీసీసీ ఆధ్వర్యంలో ఎదుళ్లపల్లి, ఓటాయి, కొత్తగూడ, రామన్నగూడెం, వేలుబెల్లిలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

టోకెన్లు ఇస్తున్న ఏవో, ఏఈవోలు..

ధాన్యం విక్రయించుకునేందుకు రైతులు వ్యవసాయ కార్యాలయం చుట్టూ తిరగకుండా నిబంధనల ప్రకారం ఏవో, ఏఈవోలు కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అందుబాటులో ఉంటూ టోకెన్‌లు ఇస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిషన్‌తో రైతులు దుమ్ము, చెత్తలేకుండా చేస్తున్నారు. ఏఈవోలు తేమశాతం పరిశీలించిన అనంతరం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసి రైతుల వివరాలు 'ఆన్‌లైన్'లో పొందుపరచటంతో సరైన సమయంలో రైతుఖాతాలో డబ్బులు జమ చేస్తున్నారు. అనంతరం రెండు, మూడు రోజుల్లో బోనస్ సైతం పడుతోండటంతో రైతులకు అదనపు ఆదాయం వస్తుందని బోనస్ పడిన రైతులు ఆనందపడుతున్నారు.

పాఠశాలల్లో పోస్టులు భర్తీ చేయాలి

టీఎస్‌జీహెచ్‌ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రప్రకాశ్

భూపాలపల్లి టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే ఆ పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్ కోరారు. భూపాలపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆ సంఘం సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా చంద్రప్రకాశ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్, శాశ్వత అటెండర్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి భర్తీ చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో చంద్రశేఖర్, సదాశివరావు, మనోహర్ నాయక్, దేవా, రవీందర్‌రెడ్డి, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

పాత కక్షలతో ఇంటికి నిప్పు

కేసు నమోదు, రిమాండ్‌కు తరలింపు



దగ్ధమైన టీవీఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనం

పెద్దవంగర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పాతకక్షల కారణంగా ఇంటికి నిప్పు పెట్టిన ఘటన పెద్దవంగర మండలంలో జరిగింది. ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. బొత్తలతండాలో జాటోత్ రవి- కల్యాణి దంపతులు ఉండగా, వారికి అదే తండాకు చెందిన కల్యాణికి అన్న అయిన మాలోత్ రమేష్‌లో కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పాత కక్షలను మనసులో పెట్టుకున్న రమేష్ ఈనెల 1న రవి దంపతులను బెదిరింపులకు గురి చేసి రాత్రి సమయంలో వారు ఉంటున్న ఇంటికి, ద్విచక్రవాహనానికి నిప్పుఅంటించాడు.

ఈ ఘటనలో ద్విచక్రవాహనం పూర్తిగా దగ్ధమైనట్లు ఎస్సై తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్సై తెలిపారు. దగ్ధమైన ద్విచక్ర వాహనం విలువ రూ.30 వేల వరకు ఉంటుందన్నారు.

మృతుడి స్మారకార్థం హెల్మెట్ల పంపిణీ

- రోడ్డు ప్రమాదంలో గత ఏడాది యువకుడి దుర్మరణం
- ఆ స్థితి ఎవరికీ రావద్దని కుటుంబ సభ్యుల వితరణ



హెల్మెట్లు పంపిణీ చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

కాటారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందాడు. హెల్మెట్ ధరించకపోవడంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. దీంతో తల్లడిల్లిన అతడి కుటుంబం ఆ పరిస్థితి ఎవరికీ రావద్దని వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేసింది. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రతాపగిరి గ్రామానికి చెందిన బండెల లతీష్ (18) గత ఏడాది బైక్ అదుపుతప్పి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అతడి కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది.

హెల్మెట్ ధరిస్తే అతడు మృతి చెందేవాడు కాదని, ఈ స్థితి మరెవరికీ రావద్దని భావించింది. మంగళవారం ఆ యువుడి ప్రథమ వర్ధంతి సందర్భంగా హెల్మెట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లతీష్ కుటుంబ సభ్యులు, స్నేహితులు వేల్పుల రాజేందర్, గుంటి చందు, లక్ష్మణ్‌రెడ్డి, రవి, గుంటి అశోక్, గాలి సత్యం, కోడూరు సతీష్, వేముల మధుకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పులు తీరుస్తూ.. పథకాలు అమలు చేస్తున్నాం

ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కేసీఆర్ చేసిన అప్పులు తీర్చుతూనే ప్రజాసంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. మంగళవారం ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా మరిపెడ మునిసిపల్ కార్మికులకు ఆరోగ్య శిబిరాన్ని వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా ఆయన ప్రారంభించి పారిశుధ్య కార్మికులకు కిట్లు అందచేసి సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలప్పుడు చెప్పిన విధంగా ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. డోర్నకల్ నియోజకవర్గానికి సంవత్సరంలోపే రూ.100కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించినట్లు గుర్తు చేశారు.

ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నేత వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తాజొద్దీన్, మాజీ సర్పంచ్ రాంలాల్, మాజీ ఎంపీటీసీ అంబరీశ, నాయకులు అప్జల్, అప్సర్, గంగయ్య, రవికాంత్, మునిసిపల్ వైస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, కమిషనర్ నరేశ్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ ప్రగతి శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.200 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

డోర్నకల్ : డోర్నకల్ నియోజకవర్గాన్ని రూ.200 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీలో భాగంగాస్థానిక రైల్వేసెంటర్ నుంచి గాంధీ విగ్రహం వరకు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ సెంటర్ ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2 లక్షల లోపు ఉన్న రైతు రుణాలను మాఫీ చేసిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ మహిళలకు సంవత్సరానికి ఒక బతుకమ్మ చీర మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలన్ని అమలు చేస్తామని చెప్పారు.

ఈ సమావేశంలో మునిసిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్‌చైర్మన్ కె.కోటిలింగం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కాల సుమీర్ చంద్‌జైన్, నాయకులు మాద శ్రీనివాస్, తాళ్లూరి హనుమ, బత్తుల శ్రీనివాస్, సుశీల్ కుమార్‌జైన్, సత్తిరెడ్డి, బషిక అశోక్, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



పొద్దు తిరుగుడు, మొక్కజొన్న చేను

ఆరుతడి పంటల్లో నీటి పారుదల ప్రాధాన్యం

వర్ధన్నపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : యాసంగిపైర్లకు నీటి తడులను సక్రమంగా అందిస్తేనే మొక్కల ఎదుగుదల, దిగుబడి బాగుంటుంది. ఆరుతడి పంటల్లో మేలైన నీరు పారుదల విధానాలను శాస్త్రవేత్త డాక్టర్ పి.మధుకర్‌రావు వివరించారు. పప్పు దినుసుల పంటలకు నాలుగైదు తడులివ్వాలి. పైరు మొగ్గతొడిగే దశ, కాయ దశల్లో నీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తపడాలి. వరిమాగాణుల్లో విత్తుకున్న పెసర, మినుముకు నేల రకాన్ని బట్టి రెండు, మూడు నీటి తడులు వదలాలి. వేరుశనగ పూత, ఊడలు దిగే, గింజలు ఏర్పడే దశల్లో నీటితడులు ఇవ్వాలి. పంటకు తుంపర సేద్య పద్ధతి అనువుగా ఉంటుంది. మక్కకు తేలిక నేలల్లో 14 తడులు నల్లల నేలలు, బరువైన నేలల్లో 6-8 తడులు ఇవ్వాలి.

విత్తిన నెల రోజులకు, పైరు పెరిగే, మోకాలి ఎత్తు, జల్లు, గింజకట్టు దశల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి. దుక్కి దున్నకుండా జీరోటిల్లేజీ పద్ధతిలో మక్కలో 45, 60, 80, 90 రోజులకు నీటి తడులను పారించాలి. విత్తిన నెల రోజుల వరకు నీరు నిల్వలేకుండా చూడాలి. పొద్దు తిరుగుడు పైరు మొగ్గదశ అభివృద్ధి సరిగా ఉండాలంటే మలిదశలో సమృద్ధిగా నీరు అందించాలి.


పూత, గింజకట్టు దశల్లో నీరం దకుంటే ఉత్పత్తి, గింజల్లో నూనె శాతం తగ్గుతుంది. కాబట్టి తగిన తడులివ్వాలి. కీలక దశల్లో నీటినందించడం ద్వారా గింజల్లో మాంసకృత్తులు, అమైనో ఆమ్లాలు వృద్ధిచెందుతాయి. నువ్వు పూత, కాయ అభివృద్ధి, గింజ నిండుకునే దశల్లో నీటి ఎద్దడి ఉండవద్దు. విత్తిన వెంటనే మొదటి నీటి తడినిచ్చి 20, 35, 45, 60 రోజులకు మళ్లీ అందించాలి. రకాల కాలపరిమితిని బట్టి దీర్ఘకాలిక రకానికి ఒక తడి ఎక్కువగా అవస రం ఉంటుంది. రైతులు వృథా నీటిని నేలలో ఇంకేలా పొలాల వందూరు ప్రాంతంలో నీరింకే గుంతలను ఏర్పాటు చేసుకోవాలి.

బిందు సేద్యం వల్ల 25-40 శాతం నీరు ఆదా కావడం, దిగుబడి పెరగడం, ఎగుడు దిగుడు భూముల్లోనూ ఇబ్బందులు లేకుండా పైర్లకు నీరందటం వంటి ప్రయోజనాలు ఉన్నాయి.



సీతాఫలం.. ఆరోగ్య ఫలం..!

- చలికాలంలో విరివిగా లభ్యం
- పుష్టిగా క్యాలరీస్, విటమిన్ - సి



వర్ధన్నపేట రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఈ సీజన్‌లో లభించే మృదు మధుర ఫలం సీతాఫలం. దీనినే కస్టర్డ్ ఆపిల్, చికుఫల్ అని కూడా పిలుస్తారు. చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతీ ఒక్కరు తినే మధుర ఫలం. ఇది సెప్టెంబరు నుంచి జనవరి వరకు లభిస్తుంది. ఈ పండ్ల ధర కూడా ఒకప్పుడు చాలా తక్కువే. కానీ వీటి పెంపకాలు తక్కువ కావడంతో ధరలు మండిపోతున్నాయి. ఇప్పుడు కిలోకు రూ.100-150 వరకు రేటు పలుకుతోంది. సీతాఫలం అనేక రోగాలకు ఔషధంలా పనిచేస్తుంది. దీని ఫలమే కాకుండా ఆకులు, విత్తనాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. సీతాఫలంలో ఫ్లేవనాయిడ్స్ ఎక్కువగా ఉంటాయి. గ్రామాల నుంచి అడవుల్లో విరివిగా కాసే ఈ పండ్లను తీసుకువచ్చి నగరాల్లో, మండల కేంద్రాల్లో, రోడ్ల పక్కన ఎక్కువగా అమ్ముతారు.



సీతాఫలంలో ఉండే పోషకాలు ఇవే

క్యాలరీస్	93 శాతం
కొవ్వు పదార్థాలు	0.3 గ్రాములు
కొవ్వు ఆమ్లాలు	0 గ్రాములు
కొలెస్ట్రాల్	0 గ్రాములు
సోడియం	9 మిల్లీ గ్రాములు
పొటాషియం	274 మిల్లీ గ్రాములు
పిండి పదార్థాలు	24 గ్రాములు
పీచు పదార్థాలు	4.4 గ్రాములు
మాంసకృత్తులు	2.1 గ్రాములు
విటమిన్ - సీ	36.3 గ్రాములు
విటమిన్ -బీ6	0.2 గ్రాములు
ఐరన్	0.6 మిల్లీ గ్రాములు
కాలియం	24 మిల్లీ గ్రాములు
మెగ్నీషియం	21 మిల్లీ గ్రాములు

ఉపయోగాలు

- సీతాఫలంలో విటమిన్-సీ, పొటాషియం, మెగ్నీషియం, ఫైబర్ వంటి పోషకాలు అధికంగా ఉండడం వలన ఆరోగ్య ప్రయోజనాలు సమకూరుతాయి.
- రోగ నిరోధక శక్తిని బలపరుస్తుంది. విటమిన్-సీ ఉండటం వలన తెల్ల రక్తకణాల ఉత్పత్తి పెరుగుతుంది.
- గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పోషకాలు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది.
- జీర్ణక్రియకు సహాయపడుతుంది. సీతాఫలంలో ఫైబర్ అధికంగా ఉండటం వలన మలబద్ధకం, అతిసారం వంటి జీర్ణ సమస్యలు సమసిపోతాయి.
- రక్తపోటు స్థాయిలను నియంత్రిస్తుంది. దీనిలో ఉండే పొటాషియం, మెగ్నీషియం రక్తనాళాలను విడదీసి సాధారంగా పని చేయడానికి సహాయపడుతుంది.
- విటమిన్-ఏ అధికంగా ఉండడంతో కంటి చూపు మెరుగుపడుతుంది. చర్మం, జుట్టును ఆరోగ్యంగా ఉంచుతుంది.
- చలికాలంలో సీతాఫలం తినడం వలన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అనేక వ్యాధులు నయం చేయడంలో ఈ పండు దోహదపడుతుంది.

మేలైన యాజమాన్యం పాటిస్తే మేలు

- మామిడిలో అధిక దిగుబడులు
- పూత దశలో ఆశిస్తున్న చీడపీడలు
- నివారణకు సస్యరక్షణ చర్యలు





తిరుపతి, ఉద్యానశాఖ అధికారి

వర్ధన్నపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మామిడి చెట్లకు పూత ఏపుగా రావడానికి యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన సమయం ఆసన్నమైంది. పూత రావడానికి వాతావరణ పరిస్థితులు ఎంతగానో ప్రభావం చూపుతాయి. చెట్లకు పూత పూయించడానికి, వచ్చిన పూత ఆగడానికి, కాపు సరిగా రావడానికి పూత దశలో ఆశించే చీడపీడల నివారణకు యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా పూత సరిగా రాక, అరకొరగా వచ్చిన పూత నిలవక దిగుబడి తగ్గిపోతుందని వర్ధన్నపేట డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి తిరుపతి పేర్కొంటున్నారు. ఈ క్రమంలో మామిడి రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

నవంబరు నుంచి జనవరి వరకు కొమ్మ కత్తిరింపులు, దున్నడం లాంటివి చేయకుండా మామిడి చెట్లకు విశ్రాంతి నివ్వాలి. ఆ సమయంలో చెట్టుకు అం తరాయం కలిగిస్తే పూతరావడం ఆలస్యం కావడం లేదా పూత రాకుండా ఉండడమే కాకుండా దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుంది.

సాధారణంగా మామిడి చెట్లకు డిసెం బరు, జనవరిలో పూత ప్రారంభమై ఫిబ్రవరి వరకు పూస్తాయి. ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పుడు పూమొగ్గలను ఉత్తేజపరిచేందుకు డిసెంబరు రెండో పక్షంలో లీటరు నీటికి 10 గ్రాముల మల్టీ-కే (పొటాషియం, నైట్రేట్), 5 గ్రాముల యూరియా కలిపి చెట్ల పైరెమ్మలు బాగా తడిచేలా పిచికారి చేయాలి. యూరియా మల్టీ-కేలోని నత్రజని, పొటాషి యం పోషకాలు కలిసి పూ మొగ్గలను ఉత్తేజ పరుస్తాయి. దీంతో చెట్లకు పూత అధికంగా రావడానికి, పిందె కట్టడానికి కాయలు మంచి సైజులో నాణ్యతగా ఎదగడానికి సహకరిస్తాయి.

చీడపీడల నివారణకు..

సాధారణంగా మామిడి చెట్లను పూత దశలో బూడిద రంగు తెగులు ఆశిస్తుంది. లేత ఆకులు, పూత కాండం, పూల మీద, చిరు పిందెల మీద, తెల్లని పౌడర్ లాంటి బూజు చేరుతుంది. దీనినే బూడిద తెగులు అన్నారు. ఇది ఎక్కువగా ఉన్నపుడు ఆశిస్తుంది. ఈ తెగులు ఎక్కువగా రాత్రి పూట చల్లగా, పగలు వేడి ఎక్కువగా ఉన్నప్పుడు ఆశిస్తుంది. ఈ తెగులు వల్ల చెట్లకు వచ్చిన పూత, కాత రాలిపోతుంది. దీని నివారణకు పూత దశలో తెగులు కనిపించగానే హెక్సాకోనజోల్ 2. ఎంఎల్, లేదా ప్రొపికోనజోల్ 1 ఎంఎల్, లేదా డినోకాప్ 1 ఎంఎల్ నీటిలో కలిపి పిచికారి చేయాలి.

పూత ఏపుగా రావడానికి..

మామిడి చెట్లకు పూత ఏపుగా రావడానికి యాజమాన్య పద్ధతులు పాటించాలి. తోటల్లో తేనెటీగ పట్టుల ఏర్పా టుకు తేనెటీగల సంచారం పెరిగి పరపరాగ సంప ర్కం అధికంగా జరుగుతుంది. దీంతో పూత ఏపుగా రావడానికి వీలవుతుంది. తద్వారా దిగుబడి 20 నుంచి 30 శాతం పెరిగేందుకు ఆస్కారం ఉం టుంది. తోట నలుమూలల తేనెపట్టులను ఏర్పా టు చేసుకోవడం వల్ల ఉపయుక్తంగా ఉంటుంది.

ఆకుమచ్చ, నల్లమచ్చ తెగుళ్ల ప్రభావం

ఆకుమచ్చ, పూతమాడు, నల్లమచ్చ తెగుళ్ల పూత సమయంలో ఆశిస్తాయి. వర్షాలు, పొగ మంచు అధికంగా ఉన్న సమయంలో ఈ తెగుళ్ల విజృంభిస్తాయి. లేత ఆకులు, రెమ్మలు, పూలను ఆశించి నష్టపరుస్తాయి. ఆకుల మీద గోధుమ రంగులో మచ్చలు ఏర్పడి ఆకులు త్వరగా పండుబారి రాలి పోతాయి. రెమ్మల పైన నల్లని మచ్చలు ఏర్పడి పూల గుత్తులు, పూలు మాడిపోతాయి. ఈ తెగులు నివారణ కోసం పూత దశకు ముందే ఎండిన కొమ్మలను కత్తిరించి తగుల బెట్టాలి. లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 శాతం బోర్డో మిశ్రమం కలిపి పిచికారి చేయాలి.

చెట్లకు పూత వచ్చే దశ

మామిడి చెట్లకు సాధారణంగా జూలై, ఆగస్టు మాసాల్లో ఇగుర్లు వచ్చి ముదురుతాయి. ఇగుర్ల రెమ్మల్లో నుంచి పూత వస్తుంది. ఆ ప్రక్రియ డిసెంబరు చివరివారం నుంచి జనవరి వరకు జరుగుతుంది. డిసెంబర్‌లో సగటు ఉష్ణోగ్రత 18 నుంచి 28 డిగ్రీల సెంటిగ్రేడ్, రాత్రి ఉష్ణోగ్రత 10 నుంచి 13 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉంటేనే చెట్లకు పూత ఏపుగా వస్తుంది. ఒక వేళ వాతావరణ పరిస్థితుల్లో తేడా ఏర్పడితే పూతలో మార్పులు ఉంటాయి. అందు చేత పూత రావడానికి రెండు నెలలు తోటలకు నీటి తడులు ఇవ్వడం పూర్తిగా నిలిపివేయాలి.



గానుగ నూనె తయారు చేస్తున్న నిర్వాహకుడు అనిల్

గానుగ నూనెకు కేరాఫ్ కోట

రసాయనాలు లేని స్వచ్ఛమైన వంట నూనెల తయారీ

ఖిలా వరంగల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పురాతన కాలంనాటి పద్ధతిలో ఎలాంటి రసాయనాలు లేకుండా స్వచ్ఛమైన వంట నూనెలకు కేరాఫ్‌గా నిలుస్తోంది వరంగల్ కోట. ఇక్కడ పల్లి, నువ్వులు, కుసుమ, సన్‌ఫ్లవర్ నూనెలను సంప్రదాయ పద్ధతిలో గానుగపట్టి తీస్తున్నారు. మధ్యకోటలో ఎద్దుల ద్వారా గానుగ తిప్పి నాణ్యమైన వంటనూనెలను తయారు చేస్తున్నారు. ఈ చిన్న పరిశ్రమను మధ్యకోటలో 10 గుంటల భూమిలో సుమారు రూ. 12 లక్షల వ్యయంతో 2 గానుగలు, 1 రేకుల షెడ్డు, 1 గది, 1 జత ఎద్దులు, ఇద్దరు పనివాళ్ళతో గతనెలలో ప్రారంభించారు. ప్రస్తుతం ఖిలావరంగల్‌తో పాటు ఉర్సు, కరీమాబాద్, రంగశాయిపేట, గిర్మాజీపేట, వరంగల్ తదితర ప్రాంత ప్రజలు ఇక్కడి నూనెలను విరివిగా వినియోగిస్తున్నారు.



గానుగ పట్టి తీసిన పల్లి, నువ్వులు, కుసుమ, కొబ్బరి, పొద్దుతిరుగుడు నూనెలు

తయారీ పద్ధతి

12 కిలోల పల్లీలు, నువ్వులు, కుసుమ, కొబ్బరి, సన్‌ఫ్లవర్ తదితర గింజలను గానుగలో పోసి 3 గంటల పాటు గానుగ పట్టితే 5 కిలోల నూనె వస్తుంది. 1 కిలో నుంచి 5 కిలోల వరకు పల్లినూనె, నువ్వులనూనె, కుసుమ, సన్‌ఫ్లవర్, కొ బ్బరినూనెలను హోల్‌సేల్, రిటేల్‌గా రూ.450 నుంచి రూ.600 వరకు అమ్ముతున్నారు. డోర్‌డెలివరీ సౌకర్యాం కూడా ఉందని, నగరవాసులకు ఉచితంగా సరఫరా చేస్తామని నిర్వాహకుడు అనిల్ తెలిపారు.

అమ్మ ఒడి అక్షయ పాత్ర

- వృద్ధులు, దివ్యాంగులకు నిత్యం భోజనం
- సకల సౌకర్యాలతో శ్మశానవాటిక ఏర్పాటు
- పేదలకు అండగా నిలుస్తున్న మోక్షారామం ఫౌండేషన్
- రామా శ్రీనివాస్ పేరుపై కొనసాగుతున్న సేవలు



శ్మశానవాటికను శుభ్రం చేస్తున్న ఫౌండేషన్ వలంటీర్లు

వరంగల్ చౌరస్తా, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : 'వృద్ధులు, దివ్యాంగులకు పట్టెడన్నం పెడితే పరమాత్ముడు సంతోషిస్తాడు' అని తల్లి చెప్పిన మాటను కొడుకు శిరసావహించారు. తన చివరి శ్వాస వరకు కూడా సేవలను కొనసాగించారు. తన మరణానంతరం కూడా సేవా కార్యక్రమాలు కొనసాగేవిధంగా తగిన ఏర్పాట్లు చేశారు. ఆయనే ప్రముఖ వ్యాపారవేత్త రామా శ్రీనివాస్. వరంగల్ నగరం 29వ డివిజన్ రామన్నపేటకు చెందిన ప్రముఖ వ్యాపార వేత్త, నిరంతర దానశీలి స్వర్గీయ రామా శ్రీనివాస్ 2016లో మోక్షారామం ఫౌండేషన్‌ను స్థాపించారు. నాటి నుంచి నిరుపేదలకు ప్రతీ రోజు రెండు పూటలా భోజనం అందుతూనే ఉంది.

ప్రతీ రోజు వృద్ధులకు భోజనం

అమ్మఒడి భవనం నుంచి ప్రతీ రోజు దాదాపు 100 మంది వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేదలకు మోక్షారామం ఫౌండేషన్ ప్రతీరోజు రుచికరమైన భోజనాన్ని అందిస్తోంది. సంస్థ వలంటీర్లు రెండు పూటలకు భోజనాన్ని క్యారియర్‌లో తీసుకెళ్లి అందజేస్తా రు. ఏడాదంతా సేవలు కొనసాగుతున్నా యి.

శ్మశాన వాటిక అభివృద్ధి

రామన్నపేటలోని మోక్షారామం (శ్మశాన వాటిక)ను దాదాపు రూ.కోటితో అభివృద్ధి చేశారు రామా శ్రీనివాస్. ఇల్లు లేని నిరుపేదల కుటుంబ సభ్యులు ఎవరైనా మృతి చెందితే వారి కోసం రెండు రూములు నిర్మించి అన్ని సదుపాయాలు కల్పించారు. మరీ నిరుపేదలైతే దహన సంస్కారాలకు కూడా ఫౌండేషన్ నుంచి ఆర్థిక సహాయం అందిస్తున్నారు. దహన సంస్కారాల అనంతరం ఎంతమంది ఉన్నా వారికి ఉచితంగా భోజనం అందిస్తున్నారు.

సేవలకు మారుపేరు మోక్షారామం

గత ఏడాది భారీ వర్షాలకు రామన్నపేట, హంటర్‌రోడ్డు ప్రాంతాలు వరద నీటిలో మునిగిపోగా ఫౌండేషన్‌నుంచి ప్రజలకు ప్రతీ రోజు భోజనం, పాలు, మందులు అందజేశారు. ప్లాస్టిక్ వాడకూడదని ఇంటింటికీ డస్ట్‌బిన్స్ బట్ట సంచులను ఉచితంగా అందజేశారు. కరోనా సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు లక్షల మాస్కులను తయారు చేసి అందరికీ ఉచితంగా పంచారు. 200 రోజుల పాటు ప్రతీ రోజు ఆస్పత్రుల్లోని రోగులు, సహాయకులు, పోలీసు సిబ్బంది, బస్టాండ్ ప్రాంగణాల్లో నిరుపేదలకు రోజుకు వెయ్యిమందికి ఆహార ప్యాకెట్లను అందజేశారు. ఆలయాలకు, వివాహాలకు, అభాగ్యులు, పాఠశాలలకు ఆర్థిక సాయం అందించారు.



రెడ్ క్రాస్ వారికి మాస్కులు అందజేస్తున్న రామా శ్రీనివాస్ (ఫైల్)

తాను నిర్మించిన శ్మశాన వాటికలోనే..

తన తల్లి మాటపై రామన్నపేట శ్మశాన వాటికను రూ.కోటి ఖర్చు చేసి వైకుంఠధామంగా తీర్చిదిద్దారు రామా శ్రీనివాస్. అయితే 11 నెలల కిందట ఆయన గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. దీంతో ఆయన పార్థివదేహానికి ఆయన కలల స్వప్నమైన మోక్షారామంలోనే అంత్యక్రియలు చేశారు. ఆయన అంతిమయాత్రకు వేలాది మంది ప్రజలు తరలి వచ్చారు.

చనిపోయినా ఆగని సేవలు

రామా శ్రీనివాస్ మృతి చెందిన రోజు కూడా ఆయనకుటుంబ సభ్యులు సేవా కార్యక్రమాలు ఆపలేదు. యథావిధిగా నిరుపేదలకు భోజనం అందించారు. ఫౌండేషన్ వలంటీర్లు దుఃఖసాగరంలో ఉండి కూడా భోజనం తయారు చేసి అందజేశారు. నిరంతరం ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ఫౌండేషన్ వలంటీర్లు, కుటుంబ సభ్యులు చెబు తున్నారు.



చెత్త డస్ట్ బిన్‌లను ఉచితంగా అందజేస్తున్న వలంటీర్లు



అమ్మఒడి భవనంలో ఆన్‌లైన్‌లో సేవలు నమోదు చేస్తున్న ఎమ్మెల్యే కొండా సురేఖ (ఫైల్)



ప్రతీ రోజు అమ్మఒడి వద్దకు వచ్చి భోజనం చేసే వృద్ధులు

పీఎం శ్రీతో పాఠశాలలకు కొత్త రూపు

- ఆధునిక ల్యాబ్‌ల ఏర్పాటు
- కొత్త ఆవిష్కరణలకు చేయూత
- విద్యార్థుల్లో నైపుణ్యానికి పెద్దపీట
- ఉమ్మడి జిల్లాకు రూ.63.10 లక్షలు మంజూరు
- మొదటి, రెండో విడతల్లో చేపట్టనున్న పనులు

హనుమకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :సర్కారు బడులను ఆధునిక పరిశోధనా కేంద్రాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రేజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకం కింద 2024-25 సంవత్సరానికి ఉమ్మడి జిల్లాకు మొత్తం రూ. 63,10,500 నిధులు మంజూరయ్యాయి. ఇందులో మొదటి దఫాలో హనుమకొండ జిల్లాకు రూ. 4, 56,500 రెండో దఫా ఉమ్మడి జిల్లాకు రూ. 45, 40,000 మంజూరయ్యాయి. వీటితో పాటు ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనకు వార్షిక గ్రాంట్‌గా మరో రూ. 13,46,000 విడుదల చేసింది.



పీఎం శ్రీ పథకం ద్వారా నిధులు మంజూరైన దామెరలోని ఎంపీపీఎస్

మొదటి దఫా..

పీఎం శ్రీ పథకం కింద మొదటి దశలో ఒక్క హనుమకొండ జిల్లాకే రూ.4,24,500 నిధులు మంజూరయ్యాయి. ఈ మొత్తంలో టీఎల్‌ఎం గ్రాంట్ కింద (ప్రీ ప్రైమరీ గ్రాంట్) కింద రూ 24 వేలు, రికరింగ్ గ్రాంట్ (ప్రీ ప్రైమరీ) కింద రూ. 4లక్షలు మంజూరయ్యాయి. ఇందులో ఐనవోలు మండలంలోని ఒంటిమామిడిపల్లి జడ్పీహెచ్‌ఎస్‌కు రూ. 2,14,500 దామెర ఎంపీపీఎస్‌కు రూ. 2, 10,000 మంజూరయ్యాయి.

రెండో విడతలో..

ఉమ్మడి జిల్లాలోని సర్కారు బడులకు రూ. 45,40,000 మంజూరయ్యాయి. ఇందులో హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని అక్కంపేట ఎంపీపీఎస్‌కు రూ. 4,54,000 జనగామ జిల్లా లింగాల ఘనపూర్ మండలంలోని నేలపోగుల ఎంపీయూపీఎస్‌కు రూ.4,54,000, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ముత్తారం మండలం మహదేవ్‌పూర్‌లోని యమ్మనపల్లి ఎంపీపీ పాఠశాలకు రూ. 4,54,000, ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని లక్ష్మీపురం ఎంపీపీ స్కూల్‌కు రూ.454,000, వెంకటాపూర్ మండలం నారాయణపూర్ ఎంపీయూపీఎస్‌కు రూ. 4,54, 000, బెస్తగూడెం ఎంపీయూపీఎస్‌కు రూ 4,54, 000, వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేట ఎంపీపీకి రూ.4,54,000 వర్ధన్నపేట మండలం ఎల్లంద ఎంపీపీకి రూ.4,54,000 నిధులు మంజూరయ్యాయి.

వార్షిక గ్రాంట్

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనకు 2024-25 సంవత్సరానికి గాను పీఎం శ్రీ వార్షిక గ్రాంట్‌గా మొత్తం రూ 13,46,000 విడుదల య్యాయి. ఈ మొత్తంలో హనుమకొండ జిల్లా కు రూ.3,48,750, వరంగల్ జిల్లాకు రూ.2,86, 750, జనగామ జిల్లాకు రూ. 2,71,750, మహ బూబాబాద్ జిల్లాకు రూ. 1,13,750, జయ శంకర్ భూపాలపల్లి జిల్లాకు రూ. 1,62,750, ములుగు జిల్లాకు రూ.1,62,750 నిధులు విడుద లయ్యాయి. కాగా హనుమకొండ జిల్లా లోని పరకాలలోని జడ్పీహెచ్‌ఎస్‌లో రూ.13,50, 000 అంచనా వ్యయంతో అదనపు గదుల నిర్మా ణాన్ని చేపట్టగా ఇప్పటి వరకు రూ. 2,91,125 విలువైన పనులు చేశారు.

పీఎం శ్రీ లక్ష్యం

జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసేందుకు వీలుగా ఇప్పటికే ఉన్న పాఠశాలలను మెరుగుపరచడం, ప్రతీ విద్యార్థి శ్రేయస్సును, భద్రతను ప్రోత్సహించడం, విభిన్న అభ్యాస అనుభవాలను అందించడం, పాఠశాలల్లో నాణ్యమైన మౌలిక సదుపాయాలను కల్పించడం ఈ పథకం ప్రాథమిక లక్ష్యం. పీఎం శ్రీ కింద మంజూరైన నిధులను ప్రధానంగా స్మార్ట్ క్లాస్ రూంలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు, వొకేషనల్ ల్యాబ్‌లు, స్కిల్ ల్యాబ్‌లు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లతో సహా అత్యుత్తమ తరగతి ఆధునిక సౌకర్యాలను కల్పించేందుకు ఖర్చు చేస్తారు.

మీ కోసం

ఆవిష్కరణల దిశగా..

పీఎం శ్రీ పథకం కింద విద్యార్థుల్లో పరిశోధనపై ఆసక్తిని పెంపొందించి, ప్రయోగశాలల్లో నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించేందుకు ఈ నిధులను ప్రధానంగా వినియోగిస్తారు. ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో ల్యాబ్‌లతో పాటు విద్యార్థుల్లో నైపుణ్యానికి పెద్దపీట వేస్తూ వృత్తి విద్యా కోర్సులను అందిస్తారు. మొత్తం నాలుగు విడతలుగా నిధులు మంజూరవుతాయి. మొదటి, రెండో విడత నిధులు రెండు రోజుల క్రితమే మంజూరయ్యాయి. పీఎం శ్రీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2022లో ప్రారంభించింది. వీటికి 2023 సంవత్సరం నుంచి నిధులను కేటాయిస్తున్నారు. మొదటి విడతగా హనుమకొండ జిల్లాలో రెండు పాఠశాలలను ఎంపిక చేశారు. రెండవ విడతలో హనుమకొండ జిల్లాలో ఒకటి, జనగామ జిల్లాలో ఒకటి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒకటి, ములుగు జిల్లాలో మూడు, వరంగల్ జిల్లాలో రెండు పాఠశాలలు ఎంపికయ్యాయి.





పీఎం శ్రీ పథకానికి ఎంపికైన పరకాల, ఒంటిమామిడిపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లు

గుమస్తాల మెరుపు సమ్మె

- పెంచిన రేట్లను అమలు చేయాలని డిమాండ్
- రెండు గంటలపాటు స్తంభించిన మార్కెట్

కేసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం గుమస్తాలు మెరుపు సమ్మె నిర్వహించారు. మార్కెట్లో ఇటీవలె వ్యాపారులతో జరిపిన చర్చల్లో గుమస్తాలకు చార్జీలు బస్తాకు రూ.2.10 ఉండగా 70పైసలు పెంచి రూ.2.80పైసలుగా నిర్ణయించారు. ఈ చార్జీలను ఈనెల 1 నుంచి అమలు చేయాల్సిఉండగా కొంతమంది వ్యాపారులు మార్కెట్ బయట చేస్తున్న ఖరీదుల్లో పాత చార్జీలనే చెల్లిస్తున్నారని గుమస్తాలు ఆరోపించారు. తమ ట్రేడింగ్ కంపెనీల వద్ద చేస్తున్న సరుకు ఖరీదులకు పెరిగిన రేట్లను ఇవ్వబోమంటూ కొంతమంది వ్యాపారులు మొండికేశారు. దీంతో గుమస్తాలు ఉదయం 'ఈ-వేలం'లో పాల్గొనేందుకు సరుకు నాణ్యతను పరిశీలించకుండా తమ విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు.

సుమారు వంద మంది వరకు గుమస్తాలు ఉండడంతో ముందుజాగ్రత్తగా ఎస్ఐ మురళీధర్‌రాజ్ యార్డుకు చేరుకున్నారు. ఎస్ఐతోపాటు ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావులు ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు శివ్వారపు శ్రీధర్, గుమస్తాల సంఘం ప్రతినిధులు ముత్యాల శివకుమార్, బొల్లు సోమేశ్వర్, కొడకండ్ల ప్రశాంత్‌రెడ్డిలతో చర్చలు జరిపారు. పెంచిన చార్జీలను అమలు చేసే విధంగా తాను బాధ్యత తీసుకుంటానని చాంబర్ కామర్స్ అధ్యక్షుడు వోలం ప్రభుకిరణ్ అధికారుల ముందు హామీ ఇవ్వడంతో గుమస్తాలు ఆందోళన విరమించి యథావిధిగా విధులు నిర్వర్తించారు.

ఈ ఆందోళన ఫలితంగా రెండు గంటలపాటు 'ఈ-వేలం' ప్రక్రియ నిలిచిపోయింది. ఫలితంగా విన్నర్‌లీస్ట్ విడుదలకు ఆలస్యమైంది. విన్నర్‌లీస్ట్ విడుదలైన వెంటనే కాంటాలు పెట్టించడంతో యార్డులో ఎలాంటి ఆలస్యం కాకపోవడంతో రైతులకు ఇబ్బందులు కలుగలేదు.

గార్లలో రైళ్లను నిలపాలి

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు వినతి

గార్ల డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల చేసే విధంగా కృషి చేయాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి బీజేపీ యువజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి విమల్ కుమార్ జైన్ నేతృత్వంలో మంగళవారం ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆదాయ వనరులు పుష్కలంగా ఉన్న గార్ల రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఇంటర్ సిటీ, చార్మినార్, గౌతమి, శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని వినతి వివరించారు. రైల్వేస్టేషన్‌లో మౌళిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. అదే విధంగా రాంపురం సమీపంలోని పాకాల ఏటీపై వంతెన నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి నిధుల మంజూరుకి కృషి చేయాలని వినతి పేర్కోన్నారు. మంత్రిని కలిసిన వారిలో అవినాష్, శ్రీరామ్, విజయ్, ఆర్.వీరన్న పాల్గొన్నారు.

అవినీతి రహిత జిల్లాగా మార్చుదాం

- 9 వరకు అవినీతి నిరోధక వారోత్సవాలు
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను అవినీతి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతీ ఒక్కరు అవినీతి నిరోధక శాఖకు సహకరించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ సూచించారు. కలెక్టర్ చాంబర్‌లో అవినీతి నిరోధక వారోత్సవాల కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అవినీతిని తరిమివేసి దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్దామన్నారు. మహబూబాబాద్ జిల్లాను అవినీతి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రజలు ఏసీబీ అధికారులకు సహకరించాలని చెప్పారు. జిల్లాలో డిసెంబర్ 3 నుంచి 9 వరకు అవినీతి నిరోధక వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎవరైనా లంచం అడిగితే ఇవ్వోద్దని, లంచం ఇవ్వాలని అడిగితే ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ - 1064కు లేదా వరంగల్ రేంజ్ ఏసీబీ ఫోన్ : 9154388912కు సమాచారం అందించాలన్నారు.



అవినీతి నిరోధక వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి, ఏసీబీ సీఐ రాజు, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే తరలించాలి

నెల్లికుదురు : కాంటాలు నిర్వహించిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ తెలిపారు. నెల్లికుదురు మండల కేంద్రంతోపాటు ఎర్రబెల్లిగూడెం, మునిగలవీడు గ్రామాలలో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందుల కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. టార్పాలిన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఓపీఎంఎస్‌లో ఎంట్రీ చేయాలన్నారు. ఎర్రబెల్లిగూడెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.పిల్లలకు అందిస్తున్న పోషకాహారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. సామ్ మాప్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అంగన్‌వాడీ కేం ద్రాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.రాజు, ఏవో యాస్మన్ పాల్గొన్నారు.

ప్రజాభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



గ్రూపులకు రుణాల చెక్కులను పంపిణీ చేస్తున్న మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజా అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా మునిసిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసీల్ సెంటర్ నుంచి మదర్‌థెరిస్సా సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం పాతబజారులోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం అవరణంలోని ఫంక్షన్‌హాల్లో సాయంత్రం జరిగిన ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలునిర్వహించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ రుణాలను చెక్కులను పంపిణీ చేశారు. ఆపై పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహిళ అభ్యున్నతే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, ఫ్లోర్ లీడర్‌లు అజయ్‌సారథిరెడ్డి, సూర్నపు సోమయ్య, కౌన్సిలర్లు ఎడ్ల వేణు, విజయలక్ష్మి, నిమ్మల శ్రీను, కోడి శ్రీను పాల్గొన్నారు.

సమీకృత గురుకుల పాఠశాలకు స్థల పరిశీలన



అయ్యగారిపల్లిలో సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణం కోసం స్థల పరిశీలన చేస్తున్న రాంచందర్‌నాయక్

కురవి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ నియోజకవర్గంలో మంజూరైన సమీకృత గురుకులా పాఠశాల భవన నిర్మాణానికి ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్ మంగళవారం స్థల పరిశీలన చేశారు. కురవి మండలం అయ్యగారిపల్లిలో జాతీయ రహదారి పక్కన 20 ఎకరాల స్థలంలో సమీకృత గురుకులాన్ని నిర్మించాలని నిర్ణయించారు. దీనికోసం స్థల పరిశీలనను తహసీల్దార్ సునీల్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విప్ రాంచందర్‌నాయక్ మాట్లాడుతూ.. డోర్నకల్ నియోజకవర్గ నడిమధ్యలో ఉన్న కురవి మండలంలోని అయ్యగారిపల్లిలో సమీకృత గురుకులాన్ని నిర్మిస్తే అందరికి అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అంబటి వీరభద్రం, తవనం సుఖేందర్‌రెడ్డి, రఘురాంరెడ్డి పాల్గొన్నారు.

- డోర్నకల్ నియోజకవర్గానికి సమీకృత గురుకులం మంజూరు చేయడం పట్ల సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తురక రమేష్, కర్నం రాజన్న, సమ్మయ్య, అజీజ్ పాషా పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి రంగయ్య

తొర్రూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి కె.రంగయ్య అన్నారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తొర్రూరు ఆస్పత్రిని సందర్శించి రోగులకు ఏర్పాటు చేసిన మౌలిక వసతులు, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. 50 పడకల ఆస్పత్రిలో కనీసం తాగునీటి వసతి లేకపోవడం సరికాదన్నారు. టీ-హబ్ పేరుతో పరీక్షలు నిర్వహిస్తూ ఏఒక్కరికి కూడా పూర్తిస్థాయిలో రిపోర్టులు అందించడం లేదని, వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేశామని చెపుతూ కాలయాపన చేస్తున్నారన్నారు.సమస్యలు పరిష్కరించకుంటే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సంతోష్, మురళి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుడు శ్రీకాంతాచారి వర్ధంతి



మానుకోటలో అమరవీరుల స్థూపం వద్ద శ్రీకాంతాచారి ఫ్లెక్సీకి నివాళ్లర్పిస్తున్న విశ్వకర్మ ఎంప్లాయీస్ అసోసియేషన్ బాధ్యులు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం తన ప్రాణాలను బలిదానం చేసిన శ్రీకాంతాచారి వర్ధంతి రోజును అమరవీరుల దినోత్సవంగా ప్రకటించాలని తెలంగాణ ఉద్యమ నాయకుడు శంతన్‌రామరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శ్రీకాంతాచారి 14వ వర్ధంతి పురస్కరించుకుని మంగళవారం మహబూబాబాద్‌లోని అమరవీరుల స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కణకణలాడే నిప్పును ముద్దాడిన శ్రీకాంతాచారి బలిదానాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికి మరువదన్నారు. నారాయణసింగ్, దర్శనం రామకృష్ణ, గుగులోతు రాములునాయక్, గుంజే హన్మంతు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

- ప్రత్యేక రాష్ట్రం కోసం కొట్లాడిన విశ్వకర్మలకు రాజకీయ ప్రాధాన్యత దక్కడంలేదని విశ్వకర్మ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దొంతోజు ఓంకార్ అన్నారు. జిల్లా కోశాధికారి ఉల్లి విద్యాసాగర్, గౌరవ అధ్యక్షులు తేలుకుంట్ల ఉపేంద్రాచారి, ఎర్రోజు లక్ష్మణ చారి, బొల్లోజు రత్నామాచారి, సోమేశ్వర్, వెంకటేశ్వర్లు, సునీత, మమత, వేణుగోపాల్ పాల్గొన్నారు.
- మండల స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. మండల అధ్యక్షుడు పమ్మి సనాతనాచారి, వంగాల పూర్ణచారి, నాగమనేశ్వర్, మోత్కూరు శంకర్, సిరికొండ హరికృష్ణ, రాజేష్, రామకృష్ణ, రాము, చంద్రమోహన్ పాల్గొన్నారు.
- కేసముద్రం : శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా కేసముద్రం అమరవీరుల స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి ఉద్యమకారులు ఘనంగా నివాళులర్పించారు. టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, మాంకాల కట్టమల్లు, షేక్ ఖాదర్, మోడెం రవీందర్‌గౌడ్, భట్టు శ్రీను, చిట్యాల వీరన్న, బాణాల నాగరాజు, దండు శ్రీనివాస్, కొలిపాక వెంకన్న, జనిగల పరమేశ్వర్, బాలుమోహన్, వేం నర్సింహారెడ్డి, సోమారపు వెంకటయ్య, వంగాల అశోక్, గాండ్ల మలేంద్రం పాల్గొన్నారు.
- కొత్తగూడ : శ్రీకాంతాచారి వర్ధంతిని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడలో నిర్వహించారు. శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కంచెర్ల సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యాక్షులు కాగితోజు ఉపేంద్రచారి, నామోజు కృష్ణ, కోశాధికారి కల్లూరి కృష్ణ, నాయకులు కట్లోజు వెంకట నారాయణచారి, కట్లోజు రవి, కట్రోజు భిక్షపతి, సత్యం, ప్రవీణ్, రవీంద్రాచారి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు ఇర్ప రాజేశ్వర్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

గూడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మణపల్లిలో ఇటీవల కాలంలో మృతి చెందిన అలువాల రాంబాబు, రంగు రవి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పృథ్వీ యూత్ సభ్యులు ఆయా కుటుంబాలను పరామర్శించి, రూ.5 వేల చొప్పున రెండు కుటుంబాలకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పృథ్వీ యూత్ సభ్యులు ముత్యం శ్రీనివాస్, గోపగాని అశోక్, పుల్లూరి రాజు, బత్తుల రమేష్, కొయ్యటి సుధాకర్, చిట్టిమల్ల ప్రవీన్, చంద్రశేఖర్, అలీమ్ పాల్గొన్నారు.

లెప్రసి సర్వే చేయించాలి

నెల్లికుదురు, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ వేతనాలు చెల్లించి ఆశవర్కర్లతో లెప్రసి సర్వే నిర్వహించాలని ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వద్ద ధర్నా నిర్వహించారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి ఇసంపెల్లి సైదులు, బాబుగౌడ్, మహేశ్వరి ఆదిలక్ష్మీ, స్వరూప, సుజాత, కవిత, సునిత, కౌసల్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్ : అమ్మాపురం, గుర్తూర్ గ్రామాల్లోకుష్టువ్యాధి నివారణకు వైద్య సిబ్బంది, అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ మేరకు డాక్టర్ మానస, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వనాకర్‌రెడ్డి పలువురిని పరిశీలించి మాట్లాడారు. అమ్మాపురంలో ఒక లెప్రసీ కేసు గుర్తించినట్లు తెలిపారు. బాధితులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆరునెలల పాటు మందులు వాడితే వ్యాధి నయం అవుతుందన్నారు. ప్రాథమిక దశలో తెలుపు రంగు, మచ్చలు, ఎరుపు రంగు, గోదుమవర్ణం కలిగి స్పర్శ జ్ఞానం లేని మచ్చలు ఏర్పడుతాయన్నారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే ఎలాంటి అంగవైకల్యం లేకుండా కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందించిన డీఎస్పీ

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గార్ల మండల కేంద్రానికి చెందిన దివ్యాంగురాలు గ్రీష్మకు హోప్‌సెప్ఫ్ ఫౌండేషన్ సహకారంతో మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తిరుపతి రావు మంగళవారం వీల్‌చైర్‌ను అందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గార్ల మండలానికి చెందిన గ్రీష్మ కుటుంబ సభ్యులు గత వారం రోజుల క్రితం దివ్యాంగురాలైన గ్రీష్మకు వీల్‌చైర్ కావాలని విజ్ఞప్తి చేయడంతో వారు వీల్‌చైర్ సమకూర్చడం అభినందనీయమన్నారు. ప్రతీ ఒక్కరు సమాజ సేవలో ముందుండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ సర్వయ్య, ఎస్సై దీపికరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తులపై చర్య తీసుకోవాలి

కేసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం విలేజీలో తమకు విక్రయించిన స్థలాన్ని తిరిగి అదే భూమిని వారి కుటుంబ సభ్యుల పేరిటే తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయించుకొని ప్లాటును కాజేయాలని ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కదిరె రాంమోహన్, బండి సత్యనారాయణలు అధికారులను కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ తప్పుడు రిజిస్ట్రేషన్లతో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

'నాబార్డు బ్యాంకు కృషి'

మరిపెడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రైతుల ఆర్థికాభివృద్ధికి నాబార్డు బ్యాంకు కృషి చేస్తోందని ఆ బ్యాంక్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఏజీఎం చంద్రశేఖర్ అన్నారు. స్పందన సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆకేరు రైతు సహకార సంఘం ఏర్పాటు చేసిన ఎరువులు -పురుగు మందుల దుకాణాన్ని అయన మరిపెడలో ప్రారంభించి మాట్లాడారు. మరిపెడ ఏడీఏ విజయ్‌చందర్, ఏవో వీరాసింగ్, స్ఫూర్తి ఎడ్యూకేషనల్, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యదర్శి ఎం.కృష్ణయ్య, ఆకేరు రైతు కంపెనీ సీఈవో ఎడెల్లి పరుశరాములు పాల్గొన్నారు.

నేడు కన్నెస్వాముల పూజ

తొర్రూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి ఆలయంలో కన్నె స్వాముల పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దారం ప్రసాద్ మంగళవారం తెలిపారు. నేడు (బుధవారం) ఉదయం 8గంటల నుంచి సీనియర్ గురుస్వామి నర్సింహరావు, కేరళ పూజారి తాంత్రి రంజిత్ పోటీ ఆధ్వర్యంలోఅత్యంత వైభవోపేతంగా కన్నె స్వాముల పూజ నిర్వహించడం జరుగుతుందన్నారు. కన్నె స్వాములు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూజా సామగ్రి ఆలయ ప్రాంగణంలో అందుబాటులో ఉంటుందని, ట్రస్టు సభ్యులు, గురు స్వాములు హాజరై విజయవంతం చేయాలన్నారు.

'కనీస వేతనాలు ఇవ్వాలి'

తొర్రూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అలువాల వీరయ్య అన్నారు. మంగళవారం తొర్రూరులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు మాధవి, ఎండీ యాకూబ్, రేణుక, నగేష్, యాకన్న, ఎల్లమ్మ, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల నిరసన

మరిపెడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ బిల్లులు ఇచ్చే వరకు తాము ఏలాంటి సర్వేలో పాల్గొనబోమని మరిపెడ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మండలంలోని ఆశా వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి వంగూరి ఉపేంద్ర మాట్లాడారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెండింగ్ బిల్లులు ఇచ్చే వరకు ఏలాంటి సర్వేలో పాల్గొనబోమని ఆశా వర్కర్లు మరిపెడ మెడికల్ ఆఫీసర్ రవికి వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దుండి వీరన్న, ఆశా వర్కర్ల మండల బాధ్యులు ఆసియా, సునీత, సంపూర్ణ, ఉమ రాణి, శ్రీలత, శైలజ, శ్రీదేవి, లలిత పాల్గొన్నారు.

'బకాయిలు చెల్లించాలి'

బయ్యారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బకాయిలు చెల్లించాకే ఆశాలతో లెప్రసీ సర్వేలు చేయించాలని సీఐటీయూ మండల కన్వీనర్ వల్లాల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కొరకు గంధంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సీఐటీయూ నాయకులు, ఆశాలు పురుషోత్తం, రమణ, శకుంతల, రాంబాయి, చంద్రకళ, సుగుణ, సావిత్ర, కళమ్మ పాల్గొన్నారు.

'కాలనీకి రహదారి సౌకర్యం కల్పించాలి'

నెహ్రూసెంటర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంలోని కేటీఆర్ కాలనీకి రహదారి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వ, సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి మంగళవారం కాలనీవాసులు కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని వేం నరేందర్‌రెడ్డి నివాసగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య మాట్లాడుతూ మహబూబాబాద్‌లోని 221/2/3 సర్వే నెంబర్లలో సుమారు 50 కుటుంబాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నిరుపేదలు 80 చదరపు గజాల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని చెప్పారు. వివిధ అవసరాల దృష్ట్యా కాలనీ నుంచి బయటకు వెళ్లి రావాలంటే సరైన రహదారి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంతకాలం ప్రైవేట్ ల్యాండ్‌లోని కాలిబాట ద్వార రాకపోకలు కొనసాగించారని చెప్పారు. ప్రైవేట్ దారులను ఆయా యాజమాన్యాలు మూసివేయడంతో కాలనీవాసులు వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లేందుకు నరకయాతన పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం సీసీ రోడ్డు, కరెంట్, వీధిలైట్లు, మిషన్ భగీరథ నల్లా కనెక్షన్‌లాంటి సౌకర్యాలు కల్పించిందన్నారు. ఇక్కడే 150 కుటుంబాలు ఓటు హక్కు కలిగి స్థిర నివాసులుగా ఉన్నారన్నారు. వారికి శాశ్వత రహదారి పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. పులి శ్రీను, సీహెచ్.రాధ, కుక్కల సుధ, రమ, సరస్వతి, పద్మ, ఉపేందర్, దేవి, కందుకూరి వీరన్న, సాంబయ్య పాల్గొన్నారు.



ప్రభుత్వ, సీఎం సలహాదారులు వేం నరేందరెడ్డిని కలిసిన మానుకోట కాలనీవాసులు

రుణమాఫీ అమలు చేయాలి

కురవి, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన రైతులందరికి రుణమాఫీ అమలు చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నల్లపు సుధాకర్ డిమాండ్ చేశారు. కురవిలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2 లక్షల రుణమాఫీకి అర్హులైన రైతులందరికి తక్షణమే రుణమాఫీ అమలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురిచేయడకుండ కాంటాలుపెట్టి తక్షణమే నగదు ఇవ్వాలన్నారు. రైతుసంఘం నాయకులు మలేడి కోటయ్య, కట్ల కృష్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కురవి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆశా కార్మికుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోతుగంటి మల్లయ్య డిమాండ్ చేశారు. కురవిలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పల్స్ పోలియో, లెప్రసీ సర్వే చేసిన కార్మికులకు వేతనం ఇవ్వకుండా వేధిస్తున్నారని తక్షణమే ఆ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరి, నిర్మల, సుజాత, హేమలత, కళమ్మ, అరుణ, భద్రయ్య, జయమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

దాడులకు వ్యతిరేకంగా పోరాడుదాం

గంగారం, డిసెంబరు 3 : దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడుదామని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ)జిల్లా ప్రధాన కార్యదర్శి ఊకే పద్మ పిలుపు నిచ్చారు. ఈ మేరకు మంగళవారం గంగారంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలోమాట్లాడారు. వజ్జా సమ్మక్క, చింతా రమా, సుభద్ర, సర్సక్క, జయసుధ, సమ్మక్క రాధిక, రమా, కరుణ, రజిత, బుచ్చమ్మ, శ్యామల పాల్గొన్నారు.

'పీహెచ్‌సీలోని సమస్యలను పరిష్కరించాలి'

కొత్తగూడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) కొత్తగూడ, గంగారం మండలాల సహయ కార్యదర్శి ల్యాదెళ్ల రాజు డిమాండ్ చేశారు. పీవైఎల్, పీవోడబ్ల్యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ల్యాదెళ్ల రాజు, నాయకులు మంగళవారం పీహెచ్‌సీ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు రాజబోయిన రాజు, నాయకులు పాల్గొన్నారు.

రైతుదీక్షను సక్సెస్ చేయండి

కురవి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి పంట రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలని రైతు బేతమల్ల సహదేవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కురవిలో విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 15న రుణమాఫీ కోసం కురవి అంబేద్కర్ సెంటర్‌లో దీక్ష చేసేందుకు పోలీసుల నుంచి అనుమతి తీసుకున్నానని, రుణమాఫీ కానీ రైతులంతా ఈ ధర్నాకు హాజరై సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దొంగరి నర్సయ్య, తేజావత్ బోజ్యానాయక్, కిశోర్‌రాజు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

నెల్లికుదురు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ప్రగతి సేవాసమితి ఆధ్వర్యంలో మంగలవారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అజారా హస్పిటల్, లక్ష్మీనర్సింహ హాస్పిటల్, మేద కంటి హస్పిటల్ వైద్యులచే వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గద్దల జాన్, చెడుపాక వెంకన్న, వేద రాజేశ్వర్, వరదయ్య, తాళ్లసునిత, పాల్వాయి పుష్పలత, పాల్గొన్నారు.

వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించాలి

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏల వారసులకు తక్షణమే ఉద్యోగాలు కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తప్పెట్ల వెంకటేష్, ఉపాధ్యక్షుడు నీరటి యాకయ్య డిమాండ్ చేశారు. మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్‌లో అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... 2020 సెప్టెంబర్ 9న అప్పటి ప్రభుత్వం అసెంబ్లీలో వీఆర్ఏలకు పేస్కేల్ ఇస్తామని, వారి వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిందన్నారు. ఆ హామీలు అమలుచేయకుండానే గత ప్రభుత్వం కాలయాపన చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్ఏలు 80 రోజుల పాటు సమ్మె చేస్తే మాజీ సీఎం కేసీఆర్ రెవెన్యూ అధికారులతో చర్చలు జరిపి జీవో నెంబర్ 81, 85లను విడుదల చేసినట్లు చెప్పారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. మహేష్‌కుమార్, ఉప్పలయ్య, శ్రీకళ, వసంత, గౌస్, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూలి ఇవ్వాలని ధర్నా

కేసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం ఎంపీడీవో కార్యాలయం ముందు మంగళవారం ఉపాధి కూలీలకు ఆరునెలలుగా పెండింగ్‌లో ఉన్న కూలి డబ్బులు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా నాయకుడు కుర్ర మహేష్, మండల అధ్యక్ష, కార్యదర్శులు కావటి నర్సయ్య, గొడిశాల వెంకన్న, బండి దర్గయ్య, సూర్నం ఉప్పలయ్య, గంధసిరి వెంకటేష్ పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ బీఎస్పీతోనే సాధ్యం

- బీఎస్పీరాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్

నెహ్రూసెంటర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ రక్షణ బీఎస్పీ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గంగాపుత్ర భవనంలో బీఎస్పీ మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల రాజకీయ శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. మహాత్మాజ్యోతి బాపూలే, డాక్టర్ బీఆర్.అంబేద్కర్, మాన్యావర్ కాన్షీరాం చిత్రపటాలకు నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మంద ప్రభాకర్ మాట్లాడుతూ భారతదేశంలో రాజ్యాంగం అమలుకాకముందు ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల మహిళలు ఎలాంటి హక్కులు, అవకాశాలులేని రెండు కాళ్ల జంతువుల మాదిరిగా జీవించేవారని చెప్పారు. అలాంటి పరిస్థితుల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎంతో శ్రమించి రాజ్యాంగం రచించారని పేర్కొన్నారు. రాజ్యాంగం అమలుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సబ్బండ జాతుల ప్రజలు సమానత్వం, సౌభ్రాతృత్వంతో జీవిస్తున్నారని చెప్పారు. అలాంటి మనల్ని బానిసలను చేసేందుకు డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును కొనుక్కొని గద్దెనెక్కుతున్నారని చెప్పారు. పాలకుల విధానాలనుఎప్పటికప్పుడు ఎండగట్టి హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈసంపల్లి ఉపేందర్, దార్ల శివరాజ్, విజయ్‌కాంత్, దార ప్రసాద్, తగరం నాగన్న, ఎడ్ల శ్రీను, తప్పెట్ల చాణక్య, ఐతం ఉపేందర్, తప్పెట్ల కృష్ణవేణి, గుగులోతు నరేష్‌నాయక్, బాష్పింగు మహేందర్, గులగట్టు హేమంత్, కొండ్ర అరుణ్, సాగర్, రాంబాబు, దాసు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.